తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-11-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:106 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

# బీజేపీ నేతలకు ఎమ్మెల్యే రాజా సింగ్ సవాల్

- రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు వస్తే.. రాజకీయ సన్యాసం చేస్తా..
- బీజేపీలో కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంది
- తెలంగాణలో పార్టీని నాశనం చేస్తున్నారంటూ బీజేపీ నేతలపై మండిపాటు
- ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

బీజేపీ నేతలకు గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ సవాల్ విసిరారు. తెలంగాణాలో ఇటీవల బీజేపీ కార్యవర్గం ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు వస్తే.. తాను రాజకీయ సన్యాసం చేస్తానని ఆ పార్టీ నేతలకు ఎమ్మెల్యే రాజాసింగ్ సవాల్ విసిరారు. బుధవారం హైదరాబాద్‌లో గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. బీజేపీలోని కొంత మంది వ్యక్తులు.. తనను లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీలో తప్పులు జరుగుతున్నాయని.. మరి ముఖ్యంగా కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు వివరించారు.

మిగతా 2లో..



# ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వండి

## రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్రం సహకారం కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- రక్షణ శాఖ భూముల బదలింపు పై విజ్ఞప్తి
- మూసీ-ఈసా నదుల సంగమంలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ
- ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం – గాంధేయ సిద్ధాంతాల ప్రచారం
- గాంధీ సరోవర్ లో ప్రతిపాదిత మౌళిక సదుపాయాలు
- రాజ్‌నాథ్‌తో సమావేశంలో సీఎం బృందం పాల్గొనిన సభ్యులు



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీపర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వారి నివాసంలో సమావేశమయ్యారు.

మిగతా 2లో..

# పిడుగు పాటుకు ముగ్గురు మృతి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడి ఇద్దరు మహిళలు, ఒక యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఘటన జోగులాంబ గద్వాల్ జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. అయిజ మండలం భూంపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ (22), సర్వేశ్ (20), సౌభాగ్యమ్మ అనే రైతులు పత్తి చేనులో పని నిమిత్తం పొలానికి వెళ్లారు. ఉదయం నుంచి పొలంలో పత్తి తీస్తూ ఉన్నారు. అయితే సాయంత్రం కాగానే ఒక్కసారిగా పొలంలో పనిచేస్తున్న కూలీలపై పిగుడు పడిరది. ఈ ప్రమాదంలో పార్వతమ్మ, సౌభాగ్యమ్మ తో పాటు సర్వేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అయితే పిడుగు పడ్డ శబ్ధానికి పక్క పొలంలో ఉన్న స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ముగ్గురు కూలీలు చనిపోవడం చూసి షాక్ అయ్యారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి గాయపడిన వారిని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వారిని పరీక్షించిన వైద్యులు వెంటనే వారికి వైద్యం అందించారు. ప్రస్తుతం వారు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# బీఆర్ఎస్ దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం...

## ఈ- కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం పేదలకు అందిస్తాం.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం



**నల్గొండ:** కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఇవాళ (బుధవారం) మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేస్తుందని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్లు ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

ప్రతి పేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. బుధవారం వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ వరంగల్ ఈస్ట్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడికి ఐదు లక్షలు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపడుతుందన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యంత నిరుపేద అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శకంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. నిరుపేదలు గుడిసెలలో, అద్దెకు ఉంటూ సుదీర్ఘ కాలంగా ఇండ్ల నిర్మాణాలకు వేచి చూస్తున్నారన్నారు. అటువంటి పేద వారి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం నిరంతరమని, ఇల్లు రాని నిరుపేదలు నిరుత్సాహపడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి నిరుపేదకు తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా సంక్షోభం

- రైతు సమస్యలు పక్కనపెట్టి అసెంబ్లీలో బురద రాజకీయాలకు ప్రాధాన్యం
- దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతగా తిప్పలు పడ్డ పరిస్థితి లేదు
- కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలన వల్లే ఈ సమస్య
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతాంగానికి యూరియా సంక్షోభం వచ్చి పడిరదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు సమస్యలు పక్కనపెట్టి.. అసెంబ్లీలో బురద రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు అని మండిపడ్డారు. భారత దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతగా తిప్పలు పడ్డ పరిస్థితులు ముందెన్నడూ లేదు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలన వల్ల పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం నడిరోడ్ల వెంట బారులు తీరుతున్నరు. ఆధార్ కార్డు, పాస్ బుక్కులు చేత పట్టుకొని యూరియా బస్తా కోసం పడిగాపులు కాస్తున్నరు. పండుగ లేదు.. పబ్బం లేదు.. వాన లేదు.. ఎండ లేదు.. రాత్రి లేదు.. పగలు లేదు క్యూలో నిలబడుతున్నరు. అలసి సొలసి పడిపోతున్నరు. ఓపిక లేక క్యూలో చెప్పులు, పాస్‌బుక్కులు, అట్ట డబ్బాలు, ఖాళీ సీసాలు, రాళ్లు పెట్టి రోజుల పాటు నిరీక్షిస్తున్నరు అని హరీశ్‌రావు తెలిపారు.

‘పత్తి పూత దశతో ఉంది.. ఇప్పుడు యూరియా వేయకపోతే దిగుబడి రాదు’ అని ఒక రైతు. ‘వరి పొట్ట దశలో ఉంది.. యూరియా చల్లకపోతే పంట వేసి వృథం’ అని మరొక రైతు పడుతున్న ఆవేదన చూస్తే గుండె తరుక్కుపోతున్నది. రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభానికి నిన్న సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో కట్టలు తెంచుకున్న రైతుల ఆగ్రహమే నిదర్శనం. ప్రభుత్వ యంత్రాంగం మీద అసహనంతో జుట్లు పట్టుకొని కొట్టుకోవాల్సి రావడమే కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనం. ఎక్కడిక్కడ హైవేలెక్కి ధర్నాలు చేస్తున్న రైతన్నల ఆగ్రహ జ్వాలలే నిదర్శనం. ఇది కాంగ్రెస్ తెచ్చిన సంక్షోభం.. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల రైతన్నకు వచ్చిన సంక్షోభం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. యూరియా అడిగిన పాపానికి రైతుల చెంపలు చెల్లుమనిపించిన సోకాల్డ్ ప్రజా పాలన ఇది. 22 నెలల పాలనలో యావత్ తెలంగాణ రైతాంగాన్ని నడి రోడ్డు మీదకు ఈడ్చిన దుర్మార్గ పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది, రేవంత్ రెడ్డిది. కేసీఆర్ పాలనలో సకాలంలో సరఫరా అయిన యూరియాను ఇప్పుడు ఎందుకు చేయలేకపోతున్నారు.

మిగతా 2లో..



# ఈ నెల 14 వరకు రాష్ట్రంలో భారీవర్షాలు కురిసే అవకాశం

- ఈ నెల 14 వరకు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం
- రేపు, ఎల్లుండి ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్షసూచన

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణలోని ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. ఇవాళ ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 14వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. రేపు, ఎల్లుండి ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. రేపు (గురువారం) కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడిరచింది.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీజేపీ నేతలకు ఎమ్మెల్యే రాజా సింగ్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల పార్టీ ఏర్పాటు చేసిన కమిటీలో 12 మంది వరకు సికింద్రాబాద్ పరిధిలోని వారికే పదవులు ఇచ్చారన్నారు. మరి జిల్లాలు, గ్రామీణ ప్రాంతంలోని కార్యకర్తల అవసరం మీకు లేదా? అంటూ బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ కమిటీని రామచందర్ రావు వేశారా? లేకుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెబితే ఈ కమిటీ వేసారా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఇక బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో తనకు మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. వాళ్లందరూ ఫోన్ చేసి.. గతంలో మీరు చెప్పిన మాటలు నిజమవుతున్నాయని అంటున్నారన్నారు. పార్టీని నాశనం చేస్తున్నారంటూ తెలంగాణలోని బీజేపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీపై సంతృప్తి ఉందా? అంటే లేదని ఎంపీలంతా చెబుతారన్నారు. దేశ రాజధాని ఢల్లీ వెళ్లి.. దేశం గురించి తనకు మాట్లాడే అవకాశం తనకు వచ్చిందంటే.. అదంతా కార్యకర్తల వల్లనేనన్నారు. గతంలో మహిళ తనపై వ్యాఖ్యలు చేసిందని గుర్తు చేశారు. ఒకరిపై కామెంట్ చేసేటప్పుడు.. వాళ్ల గురించి తెలుసుకోవాలని సూచించారు. కమిటీలో నియమించిన అశోక్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయంటూ.. అందుకు సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. గతంలో రాంచందర్ రావు నివాసం వద్ద సైతం అశోక్ అవినీతిపై చర్చ జరిగిందని గుర్తు చేశారు. అయితే తాను గోషా మహల్ ప్రజల వల్లే మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. నాలుగో సారి సైతం ఎన్నికల బరిలో నిలిచిన.. ప్రజల తనను గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తాను ఫైటరనని.. రోడ్డు మీద ఉండి కొట్లాడతానని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలనుకునే వాళ్లలో తాను ఒకడినని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తుందంటే.. రాకుండా చేశారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయ్యనని .. ఏం చేసుకుంటారో చేసుకోండంటూ బీజేపీ రాష్ట్ర నేతలను ఆయన సవాల్ విసిరారు. బీజేపీ కార్యకర్తల గొంతుగా తాను మాట్లాడుతానని.. రాజీనామా చేసిన రోజు కూడా ఇదే విషయం చెప్పానన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. తాను రాజీనామా ఇస్తానని స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లో కానీ.. గోషామహల్‌లో కానీ మళ్ళీ పోటీ చేద్దాం.. ఎవరు గెలుస్తారో చూద్దామంటూ సవాల్ విసిరారు.

# ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వండి



(మొదటి పేజీ తరువాయి)

మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టనున్న ప్రణాళికపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలంలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని, ఇందుకు అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా ప్రతిష్టాత్మకంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని వివరించారు. రాజ్‌నాథ్ గారితో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష

**పటాన్‌చెరు :** మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి స్పెషల్ పోక్స్ కోర్టు జడ్జి కే జయంతి తీర్పు ఇచ్చారని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం జార?ండ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం జీవనోపాధి కోసం బొల్లారంలోని లక్ష్మీనగర్ కాలనీలో భూస్వామి కృష్ణారావు ఇంట్లో నివాసం ఉంటూ జీవనం సాగించారన్నారు. 2019 మే 3వ తేదీ నాడు రాత్రి కృష్ణారావు కుమారుడు దుర్గాప్రసాద్ తన ఇంటి బిల్డింగ్ పైకి ఓ బాలికను తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడని తెలిపారు. బాధితురాలు తల్లిదండ్రులు బొల్లారం పీఎస్‌లో అత్యాచారానికి సంబంధించి ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి ఎస్‌హెచ్‌వో లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారన్నారు. పటాన్‌చెరులో అప్పుడు పని చేసిన డిఎస్పి ఆర్ రాజేశ్వరరావు సాక్ష్యాధారాలతో కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలను పరిశీలించి జడ్జి తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. అత్యాచారం పాల్పడిన జ్ఞానేశ్వర్ అలియాస్ దుర్గాప్రసాద్(20) బీటెక్ చదువుకున్నారని తెలిపారు. నిందితునికి శిక్షపడేలా కృషిచేసిన పోలీస్ అధికారులకు అభినందించారు.

# ప్రియురాలి మరణం తట్టుకోలేక యువకుడి బలవన్మరణం

- అమ్మా నీ గురించే నా దిగులంతా అని లేఖ
- ఆదివారం బీబీనగర్ రైల్వేట్రాక్ వద్ద యువతి ఆత్మహత్య



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

కలిసి బతకనివ్వలేదు కనీసం మా మృతదేహాలను కలిపైనా దహనం చేయండి. తను నన్ను వదిలి వెళ్లిపోయింది. నేను కూడా వెళ్లి తనకు సర్‌ప్రైజ్ ఇస్తా. అమ్మా నీ గురించే నా దిగులంతా. ఆత్యహత్య చేసుకునే ముందు ఓ యువకుడు రాసిన సూసైడ్ నోట్‌లోని అంశాలివి. ప్రియురాలి మృతిని తట్టుకోలేక వ్యవసాయ బావిలో దూకి ఆ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముందురోజే యువతి రైలు కింద పడి చనిపోవడంతో ఆ ఎడబాటును తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నాడు. ఇద్దరి మరణంతో వారి తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచల్మ గ్రామానికి చెందిన దుంపటి అంజన్న అనే వ్యక్తికి కుమార్తె హితవర్షిణి, కుమారుడు ఉన్నారు. హితవర్షిణి ఘట్‌కేసర్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. అంజన్న ఉద్యోగ రీత్యా ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నివాసముంటున్నారు. యువతి ఇటీవల సెలవులకు తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ నెల 8న తిరిగి కళాశాల ప్రారంభం అవుతుండటంతో హితవర్షిణి ముందు రోజు మధ్యాహ్నం ఇంటి నుంచి బయలు దేరి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది.

ఘట్‌కేసర్‌బీబీనగర్ రైల్వేస్టేషన్ల ప్రాంతంలోని మాధవరెడ్డి వంతెన వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆమె వద్ద లభ్యమైన కళాశాల ఐడీ కార్డు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని తెలియజేశారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సొంతూరుకు వచ్చిన హితవర్షిణి తల్లిదండ్రులతో మాట్లాడిన తీరు కూడా అనుమానాస్పదంగా ఉన్నట్లు తెలిసింది. రైలు కింద పడితే చనిపోతామా? అని తల్లిదండ్రులను అడిగినట్లు, ఆత్మహత్యకు ప్రేరేపించే ఆలోచనలు చేసినట్లు మృతురాలి తల్లిదండ్రులు రైల్వే పోలీసులకు తెలిపారు. హితవర్షిణి ఆత్మహత్య కేసును దర్యాప్తు చేపట్టిన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు ఆమె చివరగా వినయ్ అనే యువకుడికి ఫోన్ చేసినట్లు తెలుసుకుని వివరాలు సేకరిస్తుండగా అతను కూడా ఆత్మహత్యకు పాల్పడిన విషయం బయటపడిరది. హితవర్షిణి తరచూ సెలవులకు తన అమ్మమ్మ వాళ్ల ఊరుకు వెళుతుండేది. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన పెయింటర్‌గా పని చేస్తున్న వినయ్‌తో పరిచయం ఏర్పడిరది. ఇద్దరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఆదివారం రాత్రి ఆమె ఆత్మహత్యకు పాల్పడిరదని సమాచారం తెలుసుకున్న వినయ్ లక్షెట్టిపేట మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వినయ్ రాసిన సూసైడ్ నోట్‌తో వీరిద్దరూ ప్రేమించుకుంటున్నట్లు తెలిసింది.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

పాలకులు మారగానే పాలసీలు మారిపోతాయా? రైతుల కష్టాలు తీర్చని ప్రభుత్వం ఏండి ఏం లాభం. కేంద్రం నుంచి యూరియా తెప్పించడంలో, సరఫరాలో ఈ ప్రభుత్వానికి ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకపోవడం శోచనీయం. రాష్ట్రంలో రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తుండం దారుణం. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరం వైఫల్యం. రైతు డిక్లరేషన్ అని దగా చేసారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో పచ్చి మోసం చేసారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కన్నీళ్లు పెట్టిస్తున్నరు. అరిగోస పెడుతున్నరు. జై కిసాన్ అని నాటి కాంగ్రెస్ అంటే, నై కిసాన్ అని నేటి నేటి రేవంతు అంటున్నడు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.



# ఈ నెల 14 వరకు రాష్ట్రంలో భారీవర్షాలు కురిసే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

ఇవాళ హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం కురిసింది. పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, తార్నాక, ఎల్బీనగర్, పాతబస్తీ ప్రాంతాల్లో వర్షం పడిరది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రహదారులపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షానికి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను వరద ముంచెత్తి ఆవరణ మొత్తం వర్షపునీళ్లు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అలాగే యూసఫ్‌గూడ, మధురానగర్, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, ఎర్రగడ్డ, సనత్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. సైదాబాద్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్, పాతబస్తీ, బహదూర్ పుర, కిషన్ బాగ్, పురానపుల్, జూ పార్క్, మెహదీపట్నం, రేతి బౌలి, ఖైరతాబాద్, పంజాగుట్ట, మలక్‌పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, గుండ్లపోచంపల్లి, జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, నాగారం ప్రాంతాల్లో వర్షం పడుతోంది. ఈ వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో సహాయక కేంద్రం

**తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం**

**ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతల అప్పగింత**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:** నేపాల్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలువురు తెలంగాణవాసులు అక్కడ చిక్కుకుపోవడంతో, వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సహాయ కేంద్రం బాధ్యతలను ముగ్గురు అధికారుల బృందానికి అప్పగించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం తెలిపింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మాండ్‌లోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్, ప్రైవేట్ సెక్రటరీ అండ్ లైజన్ హెడ్ +91 9871999044, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ +91 9643723157, హెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి +91 9949351270.

# తగ్గనున్న సిమెంట్, స్టీల్ ధరలు

**సిమెంట్, స్టీల్‌పై జీఎస్టీని ఈ నెల 21 తర్వాత తగ్గించనున్న ప్రభుత్వం**

**ఒక్కో ఇంటి నిర్మాణంపై వేలల్లో మిగలనున్న సొమ్ము**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**



ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ఒకే విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఒక్కో ఇంటికి 180 బస్తాల వరకు సిమెంట్, 1500 కిలోల స్టీలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సిమెంట్ బస్తా ధర మార్కెట్?లో రూ.350 వరకు ఉంది. స్టీలు టన్నుకు రూ.5500 నుంచి 5700 వరకు అమ్ముతున్నారు. ఈ సామగ్రిని 28 శాతం జీఎస్టీతో(గూడ్స్? అండ్ సర్వీస్ ట్యాక్స్) ఈ నెల 21 వరకు విక్రయించనున్నారు. ఆ తర్వాత నుంచి పది శాతం జీఎస్టీ తగ్గుతుంది. దీంతో సిమెంట్?పై రూ.35 వరకు(బస్తాపై), స్టీలుకు టన్నుకు రూ.550ల వరకు ఆదా అవుతుంది. ఈ విధంగా ఇంటి నిర్మాణం పూర్తయ్యేవరకు రూ.7 వేల వరకు లబ్ధిదారుడుకు మిగులుతుంది. ఇదిలా ఉండగా ఇప్పటికీ ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారు వేగంగా పనులు మొదలుపెట్టాల్సి ఉంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇస్తున్నప్పటికీ లభించక లబ్ధిదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. స్థానికంగా వాగుల్లో ఉన్నటువంటి ఇసుకను ఇప్పటికే కొందరు ఊడ్చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యాంలు, వాగుల్లోకి ఇసుక మళ్లీ వచ్చింది. ఆయా వనరుల్లో నీరు ఉండడం వల్ల ఇసుకను తీసుకోవడానికి అవకాశం లేదు. మరో 20 రోజుల తర్వాత మాత్రమే తీసుకోవడానికి వీలుంటుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముందునుంచే జాగ్రత్త పడాలి. లేదంటే మళ్లీ వాగుల్లోని ఇసుక దళారుల పాలయ్యే అవకాశం ఉంది. కేంద్రం జీఎస్టీ(వస్తుసేవల పన్ను)ని ఇటీవల సవరించింది. సిమెంట్, స్టీలుపై ఉన్నటువంటి 28 శాతం జీఎస్టీని 18 శాతానికి కుదించింది. ఈ సామగ్రిని ఉపయోగించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణం చేపడుతున్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఒక్కో ఇంటిపై కనీసం రూ.1015 వేలు ఆదా కానున్నాయి. కామారెడ్డి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది 12,090 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో 11,883 ఇళ్లను మంజూరు చేయగా.. సుమారు 6 వేల ఇళ్లకు ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. మిగతావారు వివిధ రకాల కారణాల వల్ల ప్రారంభించలేదు. అందులో సిమెంట్, స్టీలు ధరల ప్రభావం కూడా ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కారణంగా కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 1500 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం వారికి కొంత పరిహారాన్ని ప్రకటించింది. ఇటీవల జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఇళ్లు ధ్వంసమైన వారిలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను ఆదేశించారు.

# పిడుగుపాటుతో చిన్న మహేష్ మృతి!

**సత్యనారాయణపురం గ్రామంలో శోకసంద్రం**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం గ్రామంలో పిడుగుపాటు బలి తీసుకుంది. గ్రామానికి చెందిన ధారావత్ భాషా, కాంతం దంపతుల ఏకైక ఆనందం ధారావత్ మహేష్ (ప్రియంగా చిన్న మహేష్) మంగళవారం పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. క్షణాల్లోనే కన్నుమూసిన చిన్న మహేష్ మరణ వార్త గ్రామంలో కలకలం రేపింది. చిన్న వయసులోనే మహేష్ మృతి చెందడం గ్రామ ప్రజలను కన్నీటి పర్యంతం చేసింది.


విషయం తెలిసిన సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతేకాకుండా షేక్ చాంద్ పాషా, అద్దంకి అనిల్‌కుమార్, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, గుండ్ర రఘు, మేకల నరసింహారావు, మిద్దే శ్రీను తదితరులు హాజరై కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయిన మహేష్ మరణం తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులను కృంగదీసింది. సత్యనారాయణపురం గ్రామం మొత్తాన్ని దుఃఖ ఛాయలు ఆవరించాయి.



## చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి ఘన నివాళులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమ నాయకురాలు, ధీరవనిత చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె త్యాగం, ధైర్యం మరియు పోరాటాన్ని స్మరించారు.ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,“భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి, తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనిత ఐలమ్మ, మహిళా లోకానికి స్ఫూర్తి. ఆమె వీరత్వం తరతరాలకు ఆదర్శం” అని గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో స్థానిక రాజకీయ నేతలు, పార్టీ కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, జేఏసీ సురేందర్ రెడ్డి, శోభన్ బాబు, శరణ్ గిరి, యాదగిరి గౌడ్, సందీప్, అరుణ్ తదితరులుఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ఐలమ్మ సేవలను స్మరించారు.కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలంగాణ ఉద్యమంలో మహిళా యోధుల పాత్ర, వారు చాటిన త్యాగం, స్ఫూర్తి పరిపూర్ణంగా గుర్తు చేయబడింది.



## చాకలి ఐలమ్మ 40వ వర్ధంతికి ఘనంగా నివాళులర్పించిన కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని పురస్కరించుకుని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్ల నుండి విముక్తి కోసం సాయుధ పోరాటంలో తమ ప్రాణాలను పణంగా పెట్టిన చాకలి ఐలమ్మ మహిళలకు స్ఫూర్తినిచ్చిన దీరవనిత అని కొనియాడారు. ఆమె జీవితం తెలంగాణ ఆస్తిత్వానికి ప్రతీకగా, పోరాటానికి మార్గదర్శిగా నిలిచిందని అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి, జగన్, ముద్దం శ్రీనివాస్, అబ్బో బాయ్, కోలూరి శ్యామ్, సదానంద్, లింగం, రాకేష్, రాజు, ప్రసాద్, కృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.



## ప్రజా ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**గోపాలపేట్,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** గోపాలపేట్ మండలం బుద్ధారం గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సూచించారు.

బుధవారం ఆయన బుద్ధారం గురుకుల పాఠశాలను సందర్శించి ఎలుకలు కరిచిన విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశీలించి, సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారెడ్డి మాట్లాడుతూ -ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని,

హాస్టల్ విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచి అండగా నిలిచిందని,గురుకులాల్లో పౌష్టికాహారం అందించేందుకు వంట ఏజెన్సీల పై ప్రత్యేక నిఘా ముమ్మరం చేస్తామని తెలిపారు.

దేశ భవిష్య నిర్మాణం గురుకులాల్లోనే జరుగుతుందని, చిన్న సంఘటనల పై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. చదువులో, ఆటల్లో ప్రతిభ కనబరచి వనపర్తి జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తి పట్టణానికి చెందిన విద్యావంతుడు కావున విద్యాపరమైన ఏ సమస్య అయినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని చిన్నారెడ్డి గుర్తుచేశారు.

కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, న్యాయవాది ప్రకాశ్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, కాంగ్రెస్ నాయకులు ఎంట్ల రవి, ఎల్ల గౌడ్, పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా 52 మంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు


**నాగారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అమలవుతున్న 100 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరనగర్ బస్తీ దవాఖాన ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని వివేకానంద బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో ప్రజలు, స్థానికవాసులు మరియు మున్సిపల్ సిబ్బంది కలిపి 52 మంది స్వచ్ఛంద రక్తదానులకు అవకాశం ఇచ్చారు. శిబిరం ప్రారంభ సందర్భంలో నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఉదాహరణ ఏర్పరిచారు. కార్యక్రమంలో రవన్యూ అధికారి నాగేశ్వరరావు, ఇతర మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.నాగారం మున్సిపాలిటీ అధికారులు రక్తదానం శిబిరం ద్వారా ప్రజలలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, అత్యవసర పరిస్థితులలో రక్త లభ్యతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇలాంటి శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో, అత్యవసర పరిస్థితుల్లో రక్త సరఫరా కోసం మరియు స్వచ్ఛంద సేవా మైన్స్‌ను ప్రోత్సహించడానికి ఒక ప్రధాన వేదికగా ఉంటాయి అని అధికారులు పేర్కొన్నారు.



## కీసర గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి ఘన నివాళులు

**కీసర, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసర గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వీరవాణి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కీసర రజక సంఘం ఘనంగా నివాళులు అర్పించింది. రజక సంఘం సభ్యులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తూ, ఆమె త్యాగాలు, పోరాటాలను స్మరించారు. కేంద్రానికి, గ్రామస్థాయి నాయకులకు, మరియు స్థానిక ప్రజలకు ప్రేరణగా నిలిచిన చాకలి ఐలమ్మ యొక్క సేవలను గుర్తిస్తూ, ఈ కార్యక్రమంలో కీసర మాజీ ఎంపిటిసి రమేష్‌గుప్తా, కీసర మాజీ సర్పంచ్ మాధురి వెంకటేష్, శీలం మల్లేష్, సీనియర్ రిపోర్టర్ భవాని శంకర్, జూపల్లి విజయ్, జూపల్లి సురేందర్, నల్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.రజక సంఘం సభ్యులు, గ్రామస్థులు కలిసి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమం చెలామణి, పూలమాలలతో నిండిన వాతావరణంలో ఘనంగా సాగింది.






## చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి!

**దమ్మపేటలో సిపిఎం ఆధ్వర్యంలో కార్యక్రమం.**

**దమ్మపేట, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** దొరల పెత్తనాన్ని ధైర్యంగా ఎదిరించి, తెలంగాణ సాయుధ పోరాటానికి మార్గదర్శకురాలైన వీరమాత చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం దమ్మపేటలో ఘనంగా నివాళులర్పించారు.

సిపిఎం మండల కార్యాలయం సుందరయ్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కోశాధికారి పిట్టల అర్జున్ రావు, జిలకర పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూసమస్యపై పోరాటానికి తొలి నాంది పలికిన ధీశాలి చిట్యాల ఐలమ్మ. దొరల ఆక్రమణలను ధైర్యంగా ఎదుర్కొని ప్రజలకు స్ఫూర్తి చూపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది అని పేర్కొన్నారు. మొదట ఐలమ్మ చిత్రపటానికి సీనియర్ నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం నాయకులు, సిఐటియు అంగన్వాడి రంగ నాయకులు సూరమ్మ, శాంతి, పద్మ, లక్ష్మి, వెంకటమ్మ తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌జెండర్స్‌ను సమాజం గౌరవించాలి

**పలుస శంకర్ గౌడ్ సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షులు**




**వనపర్తి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** ట్రాన్స్‌జెండర్స్‌ను సమాజం గౌరవించాలని, వారిని మనలో ఒకరిగా గుర్తించాలనీ సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌కు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ గౌడ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌కి విద్య, వైద్యం, ఉద్యోగం వంటి అన్ని రంగాల్లో అవకాశాలు లభించాలన్నారు. రాజ్యాంగం వారికి సముచిత హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పోటీల్లో జోయా మొదటి స్థానం, లక్కీ రెండో స్థానం గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది బండారు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఉదయ్‌కుమార్, ఇబ్రహీం, ట్రాన్స్‌జెండర్స్ అధ్యక్షురాలు రమ్యరెడ్డి, పద్మమ్మ, భాగ్యలక్ష్మి, కవిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి విగ్రహానికి పూలమాల స్ఫూర్తి గ్రూప్

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం 10:30 గంటలకు ఈసీఐఎల్ చౌరస్తాలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.నివాళి కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె. చంద్రశేఖర్, స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, గొడుగు యాదగిరిరావు, కృష్ణమాచార్యులు, జయరాజ్, వెంకట్, ఉదయ భాస్కర్‌లు కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, “వీరనారి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటానికి పునాది వేశారు. ఆమె త్యాగం తరతరాలకు ఆదర్శంగా నిలిచింది” అని అన్నారు.సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జె. చంద్రశేఖర్ మాట్లాడుతూ ,“తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో సామాన్య ప్రజలు కలిసికట్టుగా పోరాడిన గొప్ప ఉద్యమం. భూస్వాములు ఐలమ్మ పంటను దోచుకునేందుకు వచ్చినప్పుడు ఆమె తిరగబడి పోరాడింది. కమ్యూనిస్టుల నాయకత్వంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి వంటి నాయకులు ఆమెకు అండగా నిలిచారు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సాగిన పోరాట ఫలితంగా వేల ఎకరాల భూమిని రైతులకు అందించారు. ఇది దేశంలో భూసంస్కరణకు పునాది వేసింది” అని తెలిపారు. సీనియర్ నాయకుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, “దేశముఖులైన ఇసునూరి రామచంద్రారెడ్డి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేద ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాడి భూములను కాపాడుకున్నారు. నేడు కొంతమంది పాలకులు ఈ పోరాటాన్ని మతపరమైనదిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది మతపరమైన పోరాటం కాదు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వారు హిందువులే ఎక్కువగా ఉన్నారు. అందువల్ల తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలి” అని అన్నారు.కార్యక్రమానికి హాజరైన సభ్యులు ఉదయ భాస్కర్, వెంకట్, నరసింహ, జయరాజ్, గగన్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.






## కాజీపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**కాజీపేట సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు)** :తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి కార్యక్రమాన్ని కాజిపేట్ సిధార్థనగర్ లో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం గారి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రజక నాయకులు మాట్లాడుతూ

ఆమె అన్యాయాన్ని నిలదీసిన సివంగి వివక్షపై విరోచితంగా పోరాడిన యోధురాలనీ కొనియాడారు. భూస్వాములపై గర్జించిన వీర వనిత చాకలి ఐలమ్మ గా గుర్తింపు పొందిన తెలంగాణ వీర వనిత అని పేర్కొన్నారు. సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి ఐలమ్మ, నిజాం దొరల గుండెల్లో భయం అనే సునామి పుట్టించిన వీరనారి అణగారిన రైతాంగ ప్రజల కోసం ఉద్యమించిన విప్లవకారిని, దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ఒక నిప్పు కనిక అని కొనియాడారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు దొరలు దేశ్ముక్ ల రజాకారుల దురగాతలని ఎదిరించిన దీరశాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్ల గిరి రమేష్ ,ఆఫ్జాల్ ,బిజెపి నాయకులు ఉడతల బాబురావు, భగవాన్ ఉపాధ్యాయ ,నార్లగిరి సంపత్ ,రాముల సదానందం , రజక సంఘం నాయకులు తిరుపతి ,నర్సయ్య , నవీన్ , శీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





# నాగారం మున్సిపాలిటీ 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ విజయవంతం

**నాగారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపాలిటీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అమలుచేసిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ విజయవంతంగా ముగిసింది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు కొనసాగిన ఈ కార్యక్రమానికి ఎం.వై. ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘన ముగింపు కార్యక్రమం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి కార్యక్రమాన్ని నేతృత్వం వహించి, ప్రతి వార్డులో సేవలు అందించిన వార్డు అధికారులు, పారిశుద్య సిబ్బంది కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ అభివృద్ధిలో ముఖ్యమైన మెరుగులు సాధించబడ్డాయని అన్నారు. కార్యక్రమంలో వ్యాసరచన పోటీల్లో విజేతలైన రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేయబడగా, మున్సిపాలిటీ అభివృద్ధిలో సహకరించిన పారిశుద్య కార్మికులను ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే, లలిత కళా నాట్యమండలి ప్రదర్శించిన భరత నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.డిప్యూటీ ఇఈ సంతోష్ కుమార్, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఇతర మున్సిపాలిటీ అధికారులు, కార్యక్రమ సిబ్బంది, ఆర్.పి లు పాల్గొన్నారు. కమిషనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల సహకారంతో నగర అభివృద్ధి సాధ్యమవుతుంది. పారిశుద్య పరిరక్షణ, నీటి సరఫరా, అవగాహన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి"అని సూచించారు.హాజరైన అధికారులు ఈ 100 రోజుల కార్యాచరణ పారిశుద్య, అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి, మాధకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో భారీగా పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి, మాధకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడానికి ఏర్పడిన నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్, ఎలైట్ యాక్షన్ గ్రూప్ వంటి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తీవ్రంగా విమర్శించారు.ఆయన వివరించినట్లుగా, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో కోట్ల రూపాయల విలువ కలిగిన డ్రగ్స్, సంబంధిత కెమికల్స్ పట్టుబడటం రాష్ట్ర నిఘా వ్యవస్థ వైఫల్యాన్ని చూపుతుందని అన్నారు. అలాగే, భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా, "స్టాప్ డ్రగ్స్ - స్టార్ట్ స్పోర్ట్స్" పేరిట రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రకటించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ అంబేద్కర్ కూడలి నుండి జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీలో పాల్గొన్న యువత, విద్యార్థులు "డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత" అని చెప్పే ప్లకార్డులు వహించారు. ర్యాలీ




అనంతరం పాల్గొన్నవారు డ్రగ్స్ నిర్మూలన పట్ల ప్రాతినిధ్యంగా ప్రతిజ్ఞ చేసారు.ప్రధాన డిమాండ్లు మరియు సూచనలు: నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్, ఎలైట్ యాక్షన్ గ్రూప్ వంటి శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేయాలి. ఫార్మా, కెమికల్ పరిశ్రమల డ్రగ్స్ దందాలో పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి.అనుమతి లేని ఫ్యాక్టరీలు, పరిశ్రమలపై విస్తృత తనిఖీలు చేపట్టాలి. పరిశ్రమల యజమానులు, లీజుదారులు పరిశ్రమల్లో ఏం తయారు అవుతుందో ముందస్తుగా పరిశీలించాలి. సమాజానికి డ్రగ్స్ పట్టు మొత్తాన్ని నిష్పక్షపాతంగా వెల్లడించాలి.ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, కార్యదర్శి టీ. సత్యప్రసాద్ తదితరులు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితులు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజీ పట్వారీలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రియల్‌టైమ్ డ్రగ్స్ చర్యల ఉదాహరణగా, మహారాష్ట్ర థానే క్రైమ్ బ్రాంచ్ రెండు రోజుల క్రితం చర్లపల్లిలో సోదాలు నిర్వహించి, సుమారు 6 కేజీల మెఫెడ్రోన్ డ్రగ్స్, 35 వేల లీటర్ల రసాయనాలు, 950 కిలోల పౌడర్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. వాటి విలువ సుమారు రూ. 12,000 కోట్లు అని తెలిపినా, రాష్ట్ర నార్కోటిక్స్ అధికారులు అందులో కొంత తక్కువగా, రూ. 6 కోట్లు మాత్రమే దొరికిందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, మోసిన్, శేఖర్, కార్యవర్గ సభ్యులు సమీర్, చేతన్, శివ, నరేష్, కీర్తన, రమ్య, రవళి, సుజాత, హస్మిత్ బేగం, ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్ పాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొని, సుమారు 400 మంది యువత, విద్యార్థులు ఈ ఉద్యమానికి సానుకూలంగా సహకరించారు. ఏఐవైఎఫ్ నేతల ప్రాతినిధ్యంతో నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా, భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు అలవాట్లను, డ్రగ్స్ మాదిరి విధులను విరమించాలి అని ఉత్సాహభరితంగా పిలుపునిచ్చారు.



# చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన మాజీ మంత్రి

**వనపర్తి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆమె విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ - భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు.

నివాళుల కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్లు బండారు కృష్ణ, ప్రేమ్ నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, వజ్రాల రమేష్, సాయిలీలా, కవిత, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన రాజకీయ సామాజిక నాయకులు

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ జ్యోతి నగర్ ధోబి ఘాట్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆశ జ్యోతి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, మహిళా సంఘాలు, యువకులు హాజరై ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు చాకలి ఐలమ్మ చేసిన సేవలను స్మరించారు. ఆమె తెలంగాణ రైతాంగం కోసం, ముఖ్యంగా రజకులు, కూలీలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం సాగించిన పోరాటాలు, ఉద్యమాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. "మహిళల ఆత్మగౌరవానికి ఆమె అందించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి" అని పలువురు అభివర్ణించారు.రజక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మలాంటి నాయకులు సమాజంలో న్యాయానికి, సమానత్వానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.ప్రభుత్వం ఆమెకు అధికారికంగా నివాళులర్పించడం సంతోషకరమని, భవిష్యత్ తరాలకు ఆమె జీవితం ఒక ప్రేరణ అని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిళా సంఘాలు ఐలమ్మ పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు కలిసి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను స్థానికులు అభినందించారు.

# 12న లష్కర్ బజార్ ప్రాక్టీసింగ్ పాఠశాలలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్

**హనుమకొండ,సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

పాఠశాల విద్యార్థులలో కళలు,సంస్కృతిని ప్రోత్సహించి వారి ప్రతిభను ప్రదర్శించడానికి జిల్లా విద్యాశాఖ ఈనెల 12న లష్కర్ బజార్ ప్రాక్టీసింగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ ని ర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ఓకల్ మ్యూజిక్ సోలో క్లాసికల్,సెమి క్లాసికల్,ఓకల్ మ్యూజిక్ గ్రూప్ ఫోక్ గ్రూప్,డివోషనల్ గ్రూప్, పేట్రియాటిక్ గ్రూప్,లైట్ మ్యూజిక్ గ్రూప్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ స్ట్రింగ్ మరియు విండ్ మెలోడీ ఇన్స్ట్రుమెంట్ సోలోలో క్లాసికల్, సెమీ క్లాసికల్,ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ పర్కషన్ రితమిక్ ఇన్స్ట్రుమెంట్ సోలో క్లాసికల్,సెమీ క్లాసికల్,ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్‌ఆర్కెస్ట్రా ఫోక్ మరియు క్లాసికల్ నృత్యం,సోలో క్లాసికల్ నృత్యం,గ్రూప్ ఫోక్, జానపద గిరిజన కాంటెంపరరీ కొరియోగ్రఫీ (సినిమాలలోవి కాకుండా),ఆర్ట్ ఫామ్ లో థియేటర్ గ్రూప్ లో షార్ట్ ప్లే,రోల్ ప్లే,మిమిక్రీ,మైమ్,విజువల్ ఆర్ట్స్ లో సోలో2 డైమెన్షనల్ డ్రాయింగ్,పెయింటింగ్,ప్రింటింగ్, క్యారికేచర్,విజువల్ ఆర్ట్స్ సోలో3 డైమెన్షనల్ స్కల్ప్చర్,విజువల్ ఆర్ట్స్ గ్రూప్ లో2 డైమెన్షనల్,3 డైమెన్షనల్ ఇండి జీనియస్ టాయ్స్,గేమ్స్,లోకల్ క్రాఫ్ట్,ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ గ్రూపులో ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ డాన్స్ డ్రామా మ్యూజిక్ లేదా విజువల్ ఆర్ట్స్ లో మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు.ఈ పోటీలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులు శుక్రవారం ఉదయం 8:30కు లష్కర్ బజార్ ప్రాక్టీసింగ్ ప్రభుత్వ పాఠశాలకు చేరుకోవాలని కోరారు.వివరాలకు గుణాత్మక విద్య కోఆర్డినేటర్ డాక్టర్ బండారు మన్మోహన్ ను సంప్రదించాలని తెలిపారు.



# నీరు డ్రైనేజీ సమస్యలపై జలమండలి అధికారులతో కార్పొరేటర్ శాంతి సమీక్ష

◆ రూ.2 కోట్ల పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశం

**నాచారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ నాచారం డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై జలమండలి అధికారులతో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన డ్రైనేజీ నిర్మాణ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేయించి, పనులను ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు.ఈ పనులు త్వరగా పూర్తవ్వాలని, ప్రజలకు సమస్యలు తలెత్తకుండా పనులను పర్యవేక్షించాలని జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌కు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా పనులను నాణ్యతతో, సమర్థంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే, డివిజన్‌లో కొత్తగా ఎనిమిది ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని నిర్ణయించారు. వీటితో పాటు శ్రీ రాఘవేంద్ర నగర్‌లోని వీధి నెంబర్లు 3, 5, 7లలో కొత్త మంచినీటి పైప్లైన్ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి జలమండలికి సమర్పించాలని సూచించారు. దీనివల్ల స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు.ఈ సమావేశంలో బారాస నాయకులు సాయి జన్ శేఖర్, భూపాల్ రెడ్డి,అలాగే సివరేజ్ సూపర్వైజర్ రాకేష్ తదితర అధికారులు పాల్గొని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంగా పనిచేయాలని సంకల్పించారు.కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ – "ప్రజలకు నీరు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తక్షణమే పనులు పూర్తి చేయాలి", "కొత్త ప్రాంతాలకు కూడా అవసరమైన సౌకర్యాలు విస్తరించాలి", "అధికారులు సమన్వయంగా పనిచేస్తూ నాణ్యతతో పనులు చేయాలి" అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా నాచారం డివిజన్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను సమర్థంగా పరిష్కరించే చర్యలు చేపట్టబడుతున్నాయి. ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు జలమండలి, స్థానిక నాయకులు కలిసి పనిచేస్తున్నట్లు సమాచారం.




# జాతీయ వేదికపై తెలంగాణ జర్నలిస్టులు!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఈ నెల 11 నుంచి 13 వరకు జరగనున్న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 131వ జాతీయ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 30 మంది జర్నలిస్టుల ప్రతినిధుల బృందం మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి బయలుదేరింది.

దేశవ్యాప్తంగా సుమారు 500 మంది ప్రతినిధులు హాజరుకానున్న ఈ సమావేశాల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుడుతాడి బాపురావు, కంతేటి రమాదేవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, పొలుమారి గోపాల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాకిట అశోక్, కాలూరి శ్రీను తదితరులు పాల్గొననున్నారు.

జాతీయ స్థాయిలో జరగబోయే ఈ మహాసభల్లో మీడియా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల హక్కులు, భవిష్యత్ దిశా నిర్దేశంపై విస్తృతంగా చర్చలు జరుగనున్నాయి.



# సత్యంపేటలో దుర్ఘటన.. చిన్నారి మృతి పట్ల ఎమ్మెల్యే రాగమయి పరామర్శ!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీ పరిధిలోని సత్యంపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానికులు సోయం శివా, సంధ్య దంపతుల పాప మోక్ష దుర్గ (వయస్సు ఒక సంవత్సరం) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి సమీపంలో ఉన్న ఇంకుడు గుంతలో పడి ప్రాణాలు కోల్పోయింది. అమాయక చిన్నారి మృతి గ్రామమంతా శోకసంద్రంలో ముంచెత్తింది. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సత్యంపేట గ్రామానికి వెళ్లారు. చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దుఃఖంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, రుద్రాక్షపల్లి పంచాయతీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రావు, కాంగ్రెస్ నాయకులు భరత్ కుమార్, ఒగ్గు భూపతి రెడ్డి, కోర్సా వసంతరావు, హలవత్ అర్జున్, ప్రతాప్, బాబురావు, ధరవత్ కృష్ణ, సోయం సత్యం తదితరులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## దళిత వీర్ అవార్డు అందుకున్న రౌతు రమేష్

**హసన్ పర్తి, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ దళిత వీర్ అవార్డును అందుకున్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి అధ్వర్యంలో చుండూర్ దళిత పల్లే వీరుడు కొమ్మర్ల అనిల్ కుమార్ 34వ వర్దంతి సందర్భంగా పల్లేవీరుల మహోత్సవం బుధవారంనాడు గుంటూరు లో జరిగింది. డాక్టర్ అంబేద్కర్ బావజాలంతో మానవ గౌరవం,సాధికారత కొసం పని చెస్తున్న సామజిక ఉద్యమ నేత రౌతు రమేష్ కు దళిత వీర్ అవార్డును తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య,మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈకార్యక్రంలో డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్,డిబిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం బాగ్యరావు,డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్దంతి ఘన నివాళి విటల్ నాయక్

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ తెలంగాణ భూపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఈసిఐఎల్ క్రాస్ రోడ్స్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.విఠల్ నాయక్ మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ ధైర్యవంతురాలు, భూ పోరాట యోధురాలు. తొలి తెలంగాణ భూపోరాటానికి నాంది పలిగి, తెలంగాణ ప్రజల హక్కుల కోసం, బడుగు వర్గాల గౌరవం కోసం తన జీవితం అర్పించారు. వారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయురాలను స్మరిస్తూ నివాళులర్పించడం మనకు గర్వకారణం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు: పడమటి మల్లారెడ్డి, బాబురావ్, జి సత్యనారాయణ, సంతోష్ చారి, మూర్తుజా పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.చాకలి ఐలమ్మ భారతదేశంలో బడుగు వర్గాల కోసం అశేషంగా పని చేసిన యోధురాలు.1940-50లలో భూపోరాట ఉద్యమంలో తన సాహసంతో, ప్రజల సమస్యలపై అహర్నిశలు పోరాడి, గ్రామీణ రైతులు, వర్గాల సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆమె పోరాటం తెలంగాణ భూపోరాట ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. ప్రతి సంవత్సరం ఆమె వర్ధంతి సందర్భంగా రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, పౌరులు పూలమాలలు వేసి, ఆమె కృషిని స్మరిస్తూ నివాళులర్పిస్తారు. విఠల్ నాయక్ మాట్లాడుతూ, "చివరి వరకు ప్రజల హక్కుల కోసం నిలబడిన ఆమె దార్శనికత, ధైర్యం యువతకు మార్గదర్శకంగా ఉంటుందని విశ్వసిస్తున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమం తెలంగాణలో బడుగు వర్గాల గౌరవం, మహిళా శక్తి, ప్రాంతీయ చరిత్రపై ప్రజల్లో అవగాహన పెంచే క్రమంలో జరిగింది.



## అభివృద్ధి పనుల కోసం ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం కార్పొరేటర్

**కాప్రా, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గంలో కాప్రా సర్కిల్, మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల అభివృద్ధి కోసం డివిజన్ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ ఎల్ బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు.వినతి పత్రంలో ప్రధానంగా ఈ అభ్యర్థనలు ప్రతిపాదించబడ్డాయి:కృష్ణానగర్ కాలనీ సీనియర్ సిటిజన్ బిల్డింగ్ నిర్మాణం,రాజీవ్ నగర్ యూత్ బిల్డింగ్ నిర్మాణం, కైలాసగిరి 30 ఫీట్ రోడ్డు నిర్మాణం ,లక్ష్మీనగర్ కాలనీ స్మశాన వాటిక మరియు నోమ కళ్యాణ మండపం పక్కన గౌడ, ఎస్సీ స్మశాన వాటికలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, స్మశాన వాటికల రక్షణ కోసం ప్రహరి పెంపు డివిజన్ కార్పొరేటర్ ప్రకారం, ఈ అభ్యర్థనలు ప్రాంతీయ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కీలకంగా ఉంటాయి.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తితో వెల్ఫేర్ బోర్డును రక్షించుకోవాలి!

**వేంసూరు, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల ఐలమ్మ చూపిన పోరాట మార్గంలోనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కార్పొరేట్లకు అప్పగించకుండా కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపుతోంది. అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయకపోవడం దానికి నిదర్శనం అన్నారు.

**మల్లూరు చంద్రశేఖర్.**
**బిసిడబ్ల్యూయూ జెండా ఆవిష్కరణ చేసిన బాజీ.**

కార్మికుల కోసం పలు డిమాండ్లు ఆయన ఉంచారు. పిల్లల విద్యకు స్కాలర్‌షిప్‌లు అందించాలని, భార్యల కాన్పు సమయంలో ఇచ్చే సాయం రూ.30 వేల నుండి రూ.1 లక్షకు పెంచాలని, వివాహ కానుకను రూ.30 వేల నుండి రూ.1 లక్షకు పెంచాలని కోరారు. పనులు లేని సమయంలో భృతి, 58 ఏళ్లు నిండిన వారికి ఆసరా పింఛన్‌తో సంబంధం లేకుండా నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా భవన కార్మికులకు స్వంత గృహాల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, వైద్య సాయం, విశ్రాంతి సమయంలో ఆర్థిక సహాయం కల్పించాలని సూచించారు.



సీఐటీయూ పోరాటాల ఫలితంగా ప్రమాద భీమా సొమ్ము రూ.6 లక్షల నుండి రూ.10 లక్షలకు, సహజ మరణ భీమా రూ.1 లక్ష నుండి రూ.2 లక్షలకు పెరిగింది. సహజ మరణ పరిహారం కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.

అదే విధంగా ఈ నెల 12న ఖమ్మం నగరంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో జరగనున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముందుగా గ్రామ అధ్యక్షుడు షేక్ బాజీ బిసిడబ్ల్యూయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దూసా సత్యనారాయణచారి, శ్రీనివాసచారి, రత్నాచారి, అబ్బదాసరి రమేష్, నాగులమీరా, బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో సర్ఫేస్ పోస్టులు భర్తీ చేయాలి : ఐఎన్టియుసి

**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సత్తుపల్లి పట్టణంలో జే.వి.ఆర్ సి.హెచ్.పి లో ఫిట్ సెక్రటరీ పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఐఎన్టియుసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ క్రాంతి కుమార్ మాట్లాడారు.

ఆయన మాట్లాడుతూ జే.వి.ఆర్ సి.హెచ్.పి లో డిప్యూటేషన్ పై ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, సింగరేణిలోనే అత్యధికంగా సత్తుపల్లి సి.హెచ్.పి నుండి బొగ్గు రవాణా జరుగుతున్నప్పటికీ ఉద్యోగులు డిప్యూటేషన్ పై ఉండటం వల్ల ఇన్సెంటివ్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఐ.ఈ.డి నామ్స్ ప్రకారం మ్యాన్ పవర్ ఏర్పాటు చేయాలని కోరారు.



సుదీర్ఘకాలంగా ఏరియాలో జనరల్ అసిస్టెంట్, ఎలక్ట్రిషియన్లు, వివిధ డిజిగ్నేషన్లలో ఉన్న సీనియర్ ఉద్యోగులకు వారి సీనియార్టీ ఆధారంగా సర్ఫేస్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన సర్కులర్ ప్రకారం కాకుండా, గతంలో ఉన్న విధంగా సీనియార్టీ ఆధారంగా సర్ఫేస్ పోస్టులను భర్తీ చేసి ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే కొత్తగూడెం నుండి సత్తుపల్లి డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఉద్యోగుల కోసం సింగరేణి యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఈ సమావేశంలో జే.వి.ఆర్ సి.హెచ్.పి ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు జిల్లా ప్రెస్ క్లబ్ ఘన నివాళులు

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సమాజంలో మహిళా హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మకు జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి, దళితుల హక్కుల కోసం, మహిళల సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన చాకలి ఐలమ్మ పోరాటాలను స్మరించుకుంటూ పాల్గొన్న వారు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమానికి తెలంగాణ రజక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శనిగరం అశోక్ నాయకత్వం వహించారు. జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పి. మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ గొప్ప సామాజిక నాయకురాలు. ఆమె పోరాటం సమాజంలోని అణగారిన వర్గాలకు వెలుగు చూపింది.



నేటి యువత ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి" అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్, కోశాధికారి కోలా సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు ఎండి. రియాజ్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, కడారి శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్ కుమార్, సంయుక్త కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, గాడిపల్లి పరమేశ్వర్, మోహన్ రెడ్డి, సింగం రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొని ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.

పాల్గొన్న సభ్యులు ఆమె జీవితం సామాజిక మార్పుకు, మహిళల విద్యకు, స్వయం ఉపాధికి మార్గదర్శకంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. అలాగే చాకలి ఐలమ్మను సమాజంలో విస్తరింపజేయడానికి జిల్లాస్థాయిలో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా, యువతలో చైతన్యం కలిగించేందుకు ఆమె జీవితంపై వ్యాస రచనలు, ఉపన్యాసాలు నిర్వహించాలని కూడా నిర్ణయించారు.



## సత్తుపల్లిలో చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సభ!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్మారక సభ జరిగింది.

సభకు అధ్యక్షత వహించిన సిపిఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ రజాకార్లు, భూస్వాముల అన్యాయాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ తన పోరాట స్ఫూర్తిని చూపారని చెప్పారు. రైతాంగాన్ని సమీకరించి భూములను సాధించుకునేందుకు సాయుధ పోరాటానికి ఊపిరి పోశారని వివరించారు. నిజాం దౌర్జన్యాలు పరాకాష్టకు చేరడంతో తెలంగాణ సాయుధ పోరాటం పుట్టుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని స్పష్టం చేశారు. అమరుల త్యాగాలు వృధా కాకుండా వారి ఆశయ సాధన కోసం సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని, భవిష్యత్తు ఉద్యమాలకు పార్టీ దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన ఐలమ్మ వంటి వీరవనితలు కొత్త తరాలకు ఆదర్శమని హైలైట్ చేశారు. తెలంగాణ చరిత్రను చదవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రావుల రాజబాబు, మోరంపూడి వెంకట్రావు, భాస్కర్, రాము, నల్లగట్ల వెంకటేశ్వరరావు, జిలాని, సైదా, మీరాజ్, శివవలి, రామకృష్ణ, వెంకన్న, శివ, శ్రీనివాసరావు, బడేమియా, నభి, కుమారి, పుష్పవల్లి, రజిని తదితరులు పాల్గొన్నారు




## చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించినారు

**ఆమె పోరాటాలను స్మరించిన బీజేపీ నాయకులు**

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రైతాంగ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న వీరవనిత చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని పురస్కరించుకుని, ఈసీఐఎల్ ప్రాంతంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి ఆధ్వర్యంలో నిర్వహించారు.దళిత మహిళగా పుట్టిన చాకలి ఐలమ్మ, నల్గొండ జిల్లా భువనగిరి తాలూకా పిట్టలగుంట గ్రామానికి చెందినప్పటికీ, జమీందారీ అణచివేతకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటాన్ని నడిపిస్తూ, సమాజంలో న్యాయం, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆమె పోరాటాలు, త్యాగాలు నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామ్ ప్రదీప్ మునుగంటి మాట్లాడుతూ:"చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువతలో నేటికీ వెలుగుతున్న దీపంలాంటిది. ఆమె చేసిన త్యాగాలు, సమాజానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివి. దళితులు, రైతుల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం మనందరికీ ఆదర్శంగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లోస్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే

వినోబా భావే (18951982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్రలోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించినప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు. 1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను "వినోబా" అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు. 1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పొచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదులకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది. వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. "సర్వోదయం" అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు. వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామ స్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయంపోషణకు ప్రాముఖ్యతనిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు. వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది "గీతా ప్రవచన్", ఇది భగవద్గీతపై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీతపై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు. ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం %% ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజసేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి.

# హరిత పరిరక్షణకు నడుం బిగించలేమా!

అటవీ సంపదలు భూమాతను ఊపిరితిత్తులు. అడవులు పర్యావరణ సమతుల్యతకు పునాది రాళ్లు. అటవీ సంపద తరిగితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. మనం రేపటి తరానికి ఆస్తులు ఇవ్వవచ్చు, కాని పీల్చే గాలి, తాగే నీరు, నడిచే నేల కలుషితం అయితే మన సంపాదన వారి ఆరోగ్యకర మనుగడకు అడ్డుగా నిలుస్తుంది. పర్యావరణం అందరిదీ. దానిని కాపాడే బాధ్యత కూడా మనందరిది. అడవులు, వన్యప్రాణుల రక్షణ బాధ్యలు నిర్వహిస్తున్న సిబ్బంది పలు రకాల ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు, కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సహితం కోల్పోతున్నారు. అటవీ సంపద రక్షణలో ప్రాణాలు కోల్పోతున్న అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట భారత అటవీ మంత్రిత్వశాఖ చొరవతో 11 సెప్టెంబర్ రోజున దేశవ్యాప్తంగా "జాతీయ అటవీ అమరవీరుల దినం (నేషనల్ ఫారెస్ట్ మార్టిర్స్ డే)" పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది. 1730లో మార్వా మహరాజు అభయ్ సింగ్ రాథోర్ ఖేజర్లీ సమీప బిష్ణోయ్ గ్రామంలో చెట్లను నరికి వేయాలని ఒక అసాధారణ, ఆలోచనారహిత నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహారాజుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు ఎదురు తిరగడంతో జరిగిన హింసలో 363 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అటవీ రక్షణలో తమ ప్రాణాలను సహితం త్యాగం చేసిన అటవీ అమరవీరులను గుర్తు చేసుకుంటూ జాతీయ అటవీ అమరవీరుల దినం జరుపుకుంటున్నాం. ఫారెస్ట్ రేంజర్స్, గార్డ్స్, అటవీ అధికారులు లాంటి అటవీ సిబ్బంది నేడు సహితం అటవీ రక్షణలో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అడవుల ప్రాధాన్యాన్ని అవహగాహన పర్చడం, హరిత సంపద చేస్తున్న అమూల్య సేవలను ఏకరువు పెట్టడం, అటవీ స్మగ్లర్లు భరతం పట్టడానికి చట్టాలకు పదును పెట్టడం నిరంతరం జరగాలి. అటవీ పరిరక్షణ హీరాలను పరిచయం చేయడం, పర్యావరణ పరిరక్షణ దళాలను ఏర్పాటు చేయడం, సుస్థిర పరిరక్షణ పద్ధతులను ఆచరణలో పెట్టడం, మొక్కలు నాటడాన్ని ఉద్యమంగా చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ మార్గాలను ప్రచారం చేయడం, అమరవీరుల కుటుంబాలకు బాసటగా నిలవడం, అడవులను శుద్ధి చేయడం, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అటవీ సంపదను కాపాడడానికి ప్రణాళికలు అమలు పరచాలి. 2025 జాతీయ అటవీ అమరవీరుల దినం సందర్భంగా మనం అడవుల ద్వారా పలు రకాల ఆహార పదార్థాలను పొందుతున్నాం. అడవులు లేకపోతే శుద్ధమైన గాలి ఉండదని గమనించి ప్రతి ఒక్కరు తమ కనీస బాధ్యతగా అడవుల పరిరక్షణ ప్రచారాలు నిర్వహించాలి. భారత్‌లోకి మొత్తం భూభాగంలో 21 శాతం భూభాగం అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఎంపీ, అరుణాచల్ రాష్ట్రాల్లో అటవీ విస్తీర్ణం అధికంగా, హర్యానాలా అతి తక్కువగా అడవులు ఉన్నాయి. అడవుల ద్వారా ఆహారం, ఆక్సీజన్, వర్షం, పర్యావరణ పురోగతి, నేల పరిరక్షణ, కలప లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని గమనించి హరిత సంపదను కాపాడుకుంటూ రేపటి తరానికి నివాసయోగ్య పర్యావరణాన్ని అందిద్దాం. అడవులు జీవులకు ఆధారం, హరితమే ఆరోగ్యకర వాతావరణానికి పునాది అని నినదిస్తూ వృక్ష సంపదను కాపాడుకుందాం.



# హఠాత్తుగా జిఎస్‌టి సంస్కరణలు ఎందుకు?




ప్రధాని నరేంద్ర మోడీ చేసే వాగ్దానాల్లో, ప్రకటనల్లో ఎంతటి గాంభీర్యం ఉంటుందో ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంటుంది. ఇది బీజేపీ రాజకీయాలను గమనించిన ప్రతి ఒక్కరకి బాగా తెలుసు. తాజాగా కేంద్రంలోని మోడీ సర్కార్ జీఎస్టీలో మార్పులు తీసుకొచ్చి తమది సామన్యుడి, మధ్యతరగతి ప్రభుత్వమని చెప్పుకొనే ప్రయత్నం చేస్తోంది. దాదాపు పదకొండేళ్ల మోడీ పాలనలో జీఎస్టీ నిర్ణయాలతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు నష్టపోయింది ఎంతో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రజల కడుపు మాడ్చి ఎన్నికలకు ముందు బిర్యానీ ఫ్రీ అని ప్రకటించి పబ్బం గడుపుకోవడం కొన్ని రాజకీయ పార్టీల నైజం. ఈ విషయంలో బీజేపీ అన్ని పార్టీల కంటే పది ఆకులు ఎక్కువే చదివింది. ఈ కోవాలోనిదే తాజాగా చేసిన జీఎస్టీ శ్లాబు మార్పుల నిర్ణయం. పేదలపై, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై కేంద్రంలోని మోడీ సర్కార్‌కు ఆమాంతంగా ప్రేమ కలగడానికి కారణాలు లేకపోలేదు. ఈ ఏడాది నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. వచ్చే ఏడాది చూస్తే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఉన్నాయి. ఇక 2027లో ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల ఎన్నికలు ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని కీలక రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల ఎన్నికలు ముందుంటే.. మరోవైపు ఇండియా కూటమి తరపున ప్రారంభమైన ఓట్ చోర్.. గద్దీ చోడ్ ఉద్యమం బీజేపీకి పెనుసవాళ్లు విసురుతోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కూటమి నేతలు చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రజా మద్దతు అనూహ్యంగా వస్తోంది. దీంతో త్వరలో జరిగే వివిధ రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీ విజయ అవకాశాలకు దారులు మూసుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఊరాటనిచ్చే పేరుతో జీఎస్టీ శ్లాబులలో మార్పులకు కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకొంది. ఈ నిర్ణయంతో తాము సామాన్య, పేద ప్రజలకు ఎంతో మేలు చేశామని ప్రధాని నరేంద్ర మోడీ గాంభీర స్వరంలో చెప్పారు. కొత్త జీఎస్టీ శ్లాబ్‌లు ఈ సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోనికి రానున్నాయి. అయితే స్వాతంత్ర్య వేడుకల్లో చెప్పినట్లుగా దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ శ్లాబ్‌లు మార్చి దసరా, దీపావళి గిఫ్ట్ ఇచ్చారా, ఇప్పటికీ అమలులోనున్న జీఎస్టీ విధానంతో ఇన్నాళ్లు దగా చేశారా అన్నది ఆలోచించాలి. ఇప్పటి వరకు అమలులోనున్న జీఎస్టీ విధానంతో ప్రజలు భారం మోశారు కాబట్టే ఇపుడు వచ్చే కొత్త విధానంతో పేద, సామాన్య, మధ్య తరగతికి ఊరాట ఇచ్చినట్లు చెప్పుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు అమలులోనున్న జీఎస్టీ విధానం తీసుకొచ్చింది నరేంద్ర మోడీ సర్కార్ అన్న విషయం గమనంలోకి తీసుకోవాలి. ఇదిలావుంటే వస్తు సేవల పన్ను విధానంలో ప్రస్తుతం 0, 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉన్న సంగతి తెలిసిందే. కొత్తగా తీసుకొన్న నిర్ణయంతో ఇప్పుడున్న 12, 28 శాతం శ్లాబుల్ని ఎత్తివేసే యోచనలో ఉండగా ఇక 5, 18 శాతం శ్లాబులే ఉండే అవకాశాలు ఉన్నాయి. కానీ ఇప్పటికీ అమలులోనున్న జీఎస్టీ విధానంతో మోడీ సర్కార్ సామాన్యుల నుంచి అధిక మొత్తంలో పన్నులు వసూలు చేసింది. పదకొండేండ్ల ఎన్డీయే సర్కారు పాలనలో సామాన్యుడి జీతంలోని సింహభాగమంతా పన్నులకే పోయింది. 2014లో మోడీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పుడు కేంద్రానికి పన్నుల రూపంలో రూ.17.94 లక్షల కోట్ల మేర ఆదాయం వస్తే, 2025నాటికి అది రూ.50 లక్షల కోట్లు దాటింది. మొత్తంగా 11 ఏండ్లలో పన్నుల పేరిట రూ. 329 లక్షల కోట్లను మోడీ ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసింది. ఇక, 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ వసూళ్లు మూడు రెట్లు పెరిగాయి. 201718లో రూ.7.41 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు 202425 నాటికి రూ. 22.08 లక్షల కోట్లకు చేరుకొన్నాయి. ఇన్నిరోజులూ ప్రజల నుంచి పన్నులను పిండుకొన్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు తీరిగ్గా జీఎస్టీలో సంస్కరణలు తీసుకొస్తామని ప్రకటించడంతో మోసం చేశారని స్పష్టమవుతోంది. మోడీ సర్కార్ ఇప్పటికే అమలు చేస్తున్న జీఎస్టీ విధానంలో వ్యక్తిగత లైఫ్, హెల్త్, టర్మ్ బీమా పాలసీలపై 18శాతం అమలు చేస్తున్నారు. కానీ కొత్తగా అమలులోకి వచ్చే విధానంలో వీటిని జీఎస్టీ నుంచి తొలగిస్తున్నారు. వ్యక్తుల బీమా పాలసీల పట్ల ఉదారంగా వ్యవహరించాల్సిన మోడీ సర్కార్ ఇప్పటి వరకు 18శాతం జీఎస్టీ వసూలు చేసి ప్రజలను బీమా పాలసీలకు దూరం చేసిందని గుర్తించాలి. అలాగే 33 రకాల ప్రాణాధార ఔషధాలపై 12 శాతం జీఎస్టీ వేసింది. కొత్త విధానంలో వీటికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. అంటే ఇంతకాలం సామాన్య ప్రజల ప్రాణాధార ఔషదాలపై 12శాతం జీఎస్టీ విధించి మోడీ సర్కార్ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడిరదనే చెప్పాలి. విద్య, వైద్యం, ఆహార భద్రత కల్పన ప్రభుత్వాల బాధ్యత. ఈ రకంగా చూసుకొంటే జీఎస్టీ పాత విధానంతో మోడీ సర్కార్ ఇన్నాళ్లపాటు దోపిడి చేస్తూ వస్తోందని భావించాలి. త్వరలో వివిధ రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు చేరువయ్యే ఎత్తుగడ్డలో భాగంగానే జీఎస్టీ శ్లాబుల మార్పుతో మోడీ సర్కార్ జిమ్మిక్కులు ప్రారంభించింది. ఎందుకంటే 'ఓట్ చోర్ గద్ది చోడ్' అన్న ఇండియా కూటమి ఉద్యమంతో ఎన్నికల్లో గెలిచే మరో మార్గం లేకపోవడంతోనే మోడీ జీఎస్టీ శ్లాబులను మార్చి పేద, సామాన్య ప్రజలకు ఉద్ధరిస్తున్నట్లు ప్రకటించుకొంటోంది. కొత్త జీఎస్టీ విధానంతో ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ఉద్దేశంతోనే వీటిని పెద్ద ఎత్తున్న ప్రచారం చేసుకొనేందుకు బీజేపీ, మోడీ సర్కార్ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్





## శివ కార్తికేయన్ సెన్సేషనల్ కామెంట్స్

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ ఇటీవల 'మదరాసి' మూవీతో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లు రాబడుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శివకార్తికేయన్ సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. ''తమిళ సినిమాలు ఆ నంబర్‌కి చేరువలోకి ఉన్నాయని నేను అనుకుంటున్నాను. మరికొన్నేళ్లలో రూ. 1000 కోట్లు కలెక్షన్లు సాధిస్తాయని నమ్ముతున్నాను. చాలా తమిళ చిత్రాలు ఈ మార్క్‌ని అందుకోలేకపోతున్నాయి. స్టోరీలో నాణ్యత లేకపోవడమో లేదా పాన్ ఇండియా సబ్జెక్ట్ కాకపోవడం వల్లనో దీనికి కారణం అనిపిస్తుంది. మూవీ క్వాలిటీ సంగతి పక్కన పెడితే టికెట్ రేట్లు కూడా తమిళనాడులో చాలా తక్కువగా ఉంటాయి. బెంగళూరు ముంబైలో ఉన్నట్లు ఇక్కడ ఉంటే 'జైలర్'కు 8001000కోట్లు వచ్చి ఉండేవి. అలా అని టికెట్ల రేట్లు పెంచమని నా ఉద్దేశం కాదు. మా సినిమాలు ఉత్తరాది ప్రేక్షకుల మనసులు గెలుచుకోవాల్సిన అవసరముందని నా అభిప్రాయం'' అని చెప్పుకొచ్చాడు. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. శివకార్తికేయన్‌కు కొందరు సపోర్ట్ చేస్తుంటే మరికొందరు నెగెటివ్‌గా రియాక్ట్ అవుతున్నారు. ఇండరెక్ట్‌గా తెలుగు ఇండస్ట్రీ గురించే మాట్లాడాడని అంటున్నారు.

## క్యూరియాసిటీ పెంచుతున్న 'తెలుసు కదా'

టాలీవుడ్ యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కానీ ఈ మూవీ బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ హిట్ ఫ్లాప్ అని ఆలోచించకుండా సిద్దు జొన్నలగడ్డ వరుస సినిమాలు అనౌన్స్ చేస్తున్నాడు. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశిఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తెలుసు కదా'. వైవా హర్ష కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వ




ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన సాంగ్స్, పోస్టర్స్ మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. అక్టోబర్ 17న థియేటర్స్‌లోకి రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తున్నారు మూవీ మేకర్స్. తాజాగా, 'తెలుసు కదా' చిత్రబృందం ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్ రాబోతున్నట్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఈ సినిమా టీజర్ సెప్టెంబర్ 11న ఉదయం 11:11 గంటలకు విడుదల కాబోతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సిద్దు జొన్నలగడ్డ దూరంగా ఉండగా.. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి ముగ్గురు బాల్కనీలో నిల్చొని సరదాగా మాట్లాడుకుంటున్న పోస్టర్ షేర్ చేసి క్యూరియాసిటీ పెంచారు. ఈ పోస్ట్‌కు ''ప్రేమించడానికి జీవితం నీకు రెండు ఆప్షన్లు ఇస్తుంది.. లవ్ యూ2'' అనే క్యాప్షన్ జత చేశారు.



## మాయమై.. మళ్లీ ఇన్నాళ్లకు

ఒక పెద్ద హిట్ ఇచ్చిన దర్శకుడికి.. తర్వాత అవకాశాల విషయంలో అసలే ఇబ్బంది ఉండదు. కానీ పెట్టుబడి మీద ఐదారు రెట్లు లాభం తెచ్చి పెట్టిన 'డీజే టిల్లు' సినిమాను డైరెక్ట్ చేసిన విమల్ కృష్ణ విషయంలో మాత్రం భిన్నంగా జరిగింది. ఆ సినిమా క్రెడిట్ మొత్తం హీరో కమ్ రైటర్ సిద్ధు జొన్నలగడ్డ ఖాతాలోకి వెళ్లిపోవడంతో విమల్ కెరీర్ ముందుకు సాగలేదు. 'డీజే టిల్లు' సీక్వెల్ తీయాలనుకున్నపుడు విమల్ పక్కకు వెళ్లిపోయాడు. అతడి స్థానంలోకి మల్లిక్ రామ్ వచ్చాడు. 'టిల్లు స్క్వేర్'ను ఎందుకు డైరెక్ట్ చేయట్లేదంటే తనకు వేరే కమిట్మెంట్లు ఉన్నట్లు చెప్పాడు విమల్. కానీ 'డీజే టిల్లు' వచ్చిన మూడేళ్ల వరకు విమల్ మరో సినిమా మొదలుపెట్టలేకపోయాడు. ఐతే ఎట్టకేలకు అతను కొత్త సినిమాను ప్రారంభించాడు. చిన్న చిన్న పాత్రలతో మొదలుపెట్టి లీడ్ రోల్‌లో నటించిన 'సివరపల్లి' వెబ్ సిరీస్‌తో మంచి పేరు సంపాదించిన రాగ్ మయూర్.. విమల్ కృష్ణ కొత్త సినిమాలో హీరోగా చేస్తున్నాడు. ఇటీవల 'పరదా' సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌కు జోడీగా నటించిన రాగ్ మయూర్‌ను విమల్ ఒక ఫీచర్ ఫిలింలో ఫుల్ లెంగ్త్ హీరోగా పెట్టి సినిమా తీస్తున్నాడు. అల్లరి నరేష్‌తో 'ఆ ఒక్కటి అడక్కు' సినిమా తీసిన చిలక ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. థ్రిల్లర్ చిత్రాలతో మంచి పేరు సంపాదించిన శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. 'డీజే టిల్లు'తో హిట్టు కొట్టినా క్రెడిట్ రాని నేపథ్యంలో.. విమల్ తన ఒరిజినల్ టాలెంట్ ఏంటో ఈ సినిమాతో చూపించాల్సి ఉంది. రాగ్ మయూర్ లాంటి అప్‌కమింగ్ ఆర్టిస్టును లీడ్ రోల్‌లో పెట్టి హిట్టు కొడితే రావాల్సిన పేరంతా వస్తుందనడంలో సందేహం లేదు.



## మిరాయ్ ఆడితే.. ఆదర్శమే!

మిరాయ్.. ఇటు టాలీవుడ్ ఇండస్ట్రీ, అటు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా. ముందు ఇదేదో చిన్న సినిమా అనుకున్నారు కానీ.. రిలీజ్ టైంకి ఓ పెద్ద సినిమా రేంజిలో హైప్ తెచ్చుకుంది. 'హనుమాన్' తర్వాత మళ్లీ సూపర్ హీరో కథతోనే సినిమా చేసిన తేజ సజ్జ.. మరోసారి బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తాడనే అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నెల 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా కొన్ని విషయాల్లో పరిశ్రమకే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సినిమా కథలో భారీతనం కనిపిస్తోందిజ విజువల్స్, ఎఫెక్ట్స్ అన్నీ కూడా వేరే లెవెల్లో ఉన్నాయి. అయినా సరే.. వీలైనంత తక్కువ బడ్జెట్లో సినిమాను పూర్తి చేశారు.అనవసర ఖర్చును తగ్గించుకుని మేకింగ్ మీదే ఎక్కువ డబ్బులు పెట్టారు. అందుకే వందల కోట్లు పెట్టి తీసే సినిమాల స్థాయిలో దీని ఔట్ పుట్ కనిపిస్తోంది. తీరా చూస్తే ఈ సినిమాకు పెట్టిన ఖర్చు దాదాపు రూ.60 కోట్లేనట. పక్కా ప్రణాళికతో, ఒక విజన్‌తో పని చేయడం వల్లే ఇది సాధ్యమైంది. మరోవైపు సినిమా మీద అంచనాలు బాగానే ఉన్నాయి. ప్రేక్షకుల్లో డిమాండ్ ఉంది. అలాంటపుడు టికెట్ల ధరలను ఓ మోస్తరుగా పెంచుకోవడానికి అవకాశముంది. తెలంగాణలో కష్టం కానీ.. ఏపీలో రేట్లు అడిగితే ఇచ్చేస్తారు. కానీ 'మిరాయ్' మేకర్స్ మాత్రం రేట్ల పెంపు వద్దని నిర్ణయించుకున్నారు. నార్మల్ రేట్లతోనే సినిమాను రిలీజ్ చేయబోతున్నారు. సినిమా బాగుండి, టికెట్ల ధరలు అందుబాటులో ఉంటే జనం ఎంత బాగా థియేటర్లకు వస్తారో మహావతార నరసింహ సినిమా రుజువు చేసింది. 'లిటిల్ హార్ట్స్' సైతం ఇలాగే మ్యాజిక్ చేస్తోంది. ఈ ఎగ్జాంపుల్స్ చూసే 'మిరాయ్' టీం ఉన్న రేట్లతోనే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లుంది.



## క్రిష్-4కు లైన్ క్లియర్.. కానీ

బాలీవుడ్ సూపర్ స్టార్లలో ఒకడైన హృతిక్ రోషన్‌ను త్వరలోనే కొత్త అవతారంలో చూడబోతున్నాం. పాతికేళ్ల కెరీర్లో హీరోగానే కనిపించిన అతను.. తొలిసారిగా దర్శకుడి అవతారం ఎత్తబోతున్నాడు. తాను హీరోగా, తన తండ్రి దర్శక నిర్మాతగా వచ్చిన బ్లాక్ బస్టర్ 'క్రిష్' ఫ్రాంచైజీలో భాగంగా నాలుగో చిత్రాన్ని స్వయంగా హృతికే డైరెక్ట్ చేయబోతున్నాడు. ఈ ఫ్రాంచైజీలో తొలి మూడు చిత్రాలు కోయీ మిల్‌గయా, క్రిష్, క్రిష్3 ఒకదాన్ని మించి ఒకటి హిట్టయ్యాయి. వీటిని డైరెక్ట్ చేసిన రాకేష్ రోషన్ చాలా ఏళ్ల కిందటే క్రిష్4కు స్క్రిప్టు రెడీ చేశాడు. కానీ ఒకవైపు బడ్జెట్ సమస్యలు, మరోవైపు రాకేష్ రోషన్ ఆరోగ్య సమస్యలు ఈ సినిమాకు అడ్డంకిగా మారాయి. క్యాన్సర్ నుంచి కోలుకున్నాక కూడా ఈ సినిమాను పట్టాలెక్కించడానికి చాలా ప్రయత్నించాడు రాకేష్. కానీ ఆయన వల్ల కాలేదు. హృతిక్ మార్కెట్ స్థాయికి మించి ఖర్చు పెట్టాల్సి రావడంతో నిధులు సమకూరలేదు. బడ్జెట్ తగ్గిస్తే సినిమా చెడిపోతుందని రాకేష్ రాజీ పడలేదు. ఈలోపు ఆయనకు వయసు పెరిగి, ఓపిక తగ్గిపోయింది. దీంతో తాను ఆ సినిమాను డైరెక్ట్ చేయకూడదని నిర్ణయించుకున్నాడు. హృతిక్‌కే బాధ్యతలు అప్పగించేశాడు. ఐతే ప్రి ప్రొడక్షన్ ఆలస్యం, ఫైనాన్స్ సమకూర్చుకోవడంలో ఇబ్బందులతో సినిమా ఆలస్యమవుతూ వచ్చింది. కానీ ఇప్పుడు అన్ని అడ్డంకులూ తొలగిపోయినట్లే ఉన్నాయి. క్రిష్4 బడ్జెట్‌పై పూర్తి అవగాహన తెచ్చుకున్నామని, అన్ని లెక్కలూ వేసుకుని ప్రి ప్రొడక్షన్ పనులూ మొదలుపెట్టామని రాకేష్ రోషన్ వెల్లడిరచాడు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలవుతుందని.. 2027లో రిలీజ్ ఉంటుందని కూడా రాకేష్ రోషన్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం చేతిలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి.. ఆ తర్వాత 'క్రిష్4'కు అంకితం కానున్నాడు హృతిక్.

## సంబరాల ఏటిగట్టు

### యాక్షన్ సీక్వెన్స్‌తో కీలక షెడ్యూల్

హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'సంబరాల ఏటిగట్టు'. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం కీలక మైన షెడ్యూల్ చేస్తున్నారు. రోహిత్ కెపి దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి రూ.125 కోట్ల బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇది సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ కావడం విశేషం. తాజా షెడ్యూల్‌లో పీటర్ హెయిన్ ఓ అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌కి యాక్షన్ కొరియోగ్రఫీ చేయబోతున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో పవర్ ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ సూపర్‌స్టార్‌తో సాయి దుర్గ తేజ్ తలపడతారు. గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే వీఎఫ్ఎక్స్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని మొదట దసరా సందర్భంగా విడుదల చేయాలని అనుకున్నారు. అయితే ఇండిస్ట్రీ సమ్మె కారణంగా రిలీజ్ వాయిదా పడిరది. త్వరలోనే మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. 'హనుమాన్' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టులలో ఈ సినిమా ఒకటి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న 'సంబరాల యేటి గట్టు' పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది.






## బోనీకపూర్ కొంపముంచిన ఆ సినిమా

బాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన బోనీ కపూర్.. ఈ మధ్య సినిమాల నిర్మాణం తగ్గించేశారు. చివరగా ఆయన్నుంచి 'మైదాన్' సినిమా వచ్చింది. ఆ సినిమా రిలీజై ఏడాదిన్నర కావస్తున్నా.. కొత్తగా మరే చిత్రాన్ని మొదలుపెట్టలేదు బోనీ. కనీసం అనౌన్స్‌మెంట్ కూడా లేదు. ఆయనకు ఇక సినిమాలు ప్రొడ్యూస్ చేసే ఉద్దేశం ఉందా అనే సందేహాలు కూడా కలుగుతున్నాయి. 'మైదాన్' సినిమా బోనీని అంతగా దెబ్బ కొట్టినట్లు తెలుస్తోంది. ఈ సినిమా బోనీతో పాటు సహ నిర్మాతలైన జీ స్టూడియోస్ వారికి ఏకంగా వంద కోట్ల మేర నష్టం తెచ్చిపెట్టిందట. 'బదాయి హో' లాటి మంచి సినిమా తీసిన అమిత్ శర్మ దర్శకత్వంలో అజయ్ దేవగణ్ కథానాయకుడిగా నటించిన సినిమా ఇది. సయ్యద్ అబ్దుల్ రహీమ్ అనే హైదరాబాదీ దిగ్గజ ఫుట్‌బాలర్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కానీ ఆశించిన వసూళ్లు రాలేదు. బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ అయింది. బడ్జెట్ తడిసి మోపెడు కావడం 'మైదాన్'కు అతి పెద్ద సమస్యగా మారింది. సినిమా మొదలైన నాలుగైదేళ్ల తర్వాతే ఈ చిత్రం రిలీజైంది. కొవిడ్ వల్ల షెడ్యూళ్లన్నీ మారిపోయి బడ్జెట్ అనుకున్న దాని కంటే ఏకంగా రూ.90 కోట్లు పెరిగిందట. ఈ సినిమా విషయంలో మొత్తం అస్తవ్యస్తంగా మారి తాము ఎలా నష్టపోయామో బోనీ ఓ ఇంటర్వ్యూలో వెల్లడిరచాడు. ''మేం రూ.120 కోట్ల బడ్జెట్లో ఈ సినిమా తీయాలనుకున్నాం. కానీ సినిమా పూర్తయ్యేసరికి రూ.210 కోట్లు అయ్యింది. కొవిడ్ రాకముందు సినిమా చిత్రీకరణ 70 శాతం మేర పూర్తయింది. 2020 మార్చిలో ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు సంబంధించిన సన్నివేశాలు తీయాలనుకున్నాం. ఇంటర్నేషనల్ టీమ్స్ వచ్చాయి. అంతలో లాక్‌డౌన్ వచ్చింది. విమాన ప్రయాణాలు రద్దయ్యాయి. కొన్ని నెలల పాటు లాక్‌డౌన్ కొనసాగడంతో ఆటగాళ్లందరికీ ముంబయిలో వసతి ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఐఫోన్ 17 సిరీస్ విడుదల చేసిన యాపిల్

ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ కొత్త సిరీస్ లాంచ్ మంగళవారం జరిగింది. 'ఆ.. డ్రాపింగ్' పేరుతో యాపిల్ పార్క్‌లో ఈవెంట్ నిర్వహించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో యాపిల్ తన కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఐఫోన్ 17 సిరీస్‌లో భాగంగా కంపెనీ కొత్తగా ఐఫోన్ ఎయిర్ మోడల్‌ను తీసుకొచ్చింది. ఐఫోన్ 17, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్, ఐఫోన్ ఐఫోన్ ఎయిర్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈసారి ప్లస్ మోడల్‌కు బదులుగా ఎయిర్‌ను తీసుకొచ్చింది. వీటితో పాటు యాపిల్ ఎయిర్‌పాడ్స్ ప్రో3, యాపిల్ వాచ్ ఆల్ట్రా 3, యాపిల్ వాచ్ సిరీస్ 11, యాపిల్ వాచ్ ఎస్‌ఈలను విడుదల చేసింది. ఏ19 చిప్‌సెట్ ద్వారా పనిచేసే కొత్త ఐఫోన్ ఐఓఎస్ 26తో, విజువల్ ఇంటెలిజెన్స్, లైవ్‌ట్రాన్స్‌లేషన్ ఫీచర్స్ కలిగి ఉంది. ఈసారి ఈవెంట్‌లో యాపిల్ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సూపర్ స్లిమ్ ఐఫోన్ 17 ఎయిర్‌ను 5.5ఎంఎం మందంతో విడుదల చేసింది. ఈ పరికరం ఏ19 ప్రో చిప్‌సెట్, 6.6 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేతో వస్తుంది. ది ఎయిర్ కొత్త ఎన్1 చిప్ ద్వారా అప్‌గ్రేడ్ చేసిన వైఫై7, బ్లూటూత్ 6తో లభిస్తుంది. అంతేకాకుండా 48ఎంపీ డ్యూయల్‌కెమెరా సిస్టమ్‌తో వచ్చే ఐఫోన్ ఎయిర్ రోజంతా బ్యాటరీ వాడేలా 40 గంటల వరకు వీడియో ప్లేబ్యాక్ చేయొచ్చని, ప్రత్యేకంగా ఈ ఫోన్‌లో ఈసిమ్ సౌకర్యం ఉంటుందని కంపెనీ వెల్లడిరచింది. కొత్త ఐఫోన్ 17 సిరీస్ కోసం సెప్టెంబర్ 12 నుంచి ప్రీబుకింగ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 19 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ తెలిపింది.



# ధరలు తగ్గించిన మరిన్ని వాహన తయారీ కంపెనీలు

తగ్గిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల ప్రయోజనాలను వినియోగదారులకు అందించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలు వాహన తయారీ కంపెనీలు తగ్గింపు ధరల వివరాలను ప్రకటించాయి. మంగళవారం మరిన్ని టూవీలర్, కార్ల తయారీ కంపెనీలు ధరల వివరాలను వెల్లడిరచాయి. అందులో ప్రముఖ బజాజ్ ఆటో జీఎస్టీ సంస్కరణల ఫలాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని స్పష్టం చేసింది. పన్ను రేట్ల తగ్గింపు బజాజ్, కేటీఎం మోటార్‌సైకిళ్లు, స్కూటర్లపై రూ. 20,000, త్రీవీలర్లపై రూ. 24,000 వరకు తగ్గిస్తున్నట్టు తెలిపింది. మరో టూవీలర్ కంపెనీ యమహా సైతం అన్ని మోడళ్లపై రూ. 17,581 వరకు తగ్గిస్తున్నామని చెప్పింది. సవరించిన ధరల ప్రకారం, ఆర్15 మోటార్‌సైకిల్ రూ. 2.12 లక్షల నుంచి రూ. 1.94 లక్షలకు, రేజర్ బైక్ రూ. 7,759 తగ్గి రూ. 93,760కే అందుబాటులో ఉంటుందని కంపెనీ వివరించింది. ఇదే బాటలో కార్ల తయారీ కంపెనీలు కూడా తగ్గింపు ధరలను ప్రకటించాయి. హోండా కార్స్ ఇండియా తమ అన్ని కార్లపై రూ. 95,500 వరకు తగ్గించామని పేర్కొంది. కాంపాక్ట్ సెడాన్ అమేజ్ కారుపై రూ. 95,500, సిటీ కారుపై రూ. 57,500, ఎలివేట్ రూ. 58,400 వరకు తగ్గుతాయని వెల్లడిరచింది. మరో కంపెనీ జీప్ ఇండియా కూడా తమ కార్లపై మోడల్, వేరియంట్‌ని బట్టి రూ. 1.26 లక్షల నుంచి రూ. 4.8 లక్షల వరకు తగ్గుతాయని వెల్లడిరచింది. ప్రీమియం కార్ల కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) తన అన్ని మోడళ్లపై రూ. 4.5 లక్షల నుంచి రూ. 30.4 లక్షల వరకు తగ్గింపు అమలు చేస్తామని తెలిపింది. అలాగే, వోల్వో కార్ ఇండియా కూడా అన్ని మోడళ్లపై రూ. 6.9 లక్షల వరకు తగ్గిస్తామని పేర్కొంది.

# జీఎస్టీ సంస్కరణలు, ట్రంప్ టారిఫ్‌కు సంబంధం లేదు



వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. మంగళవారం జాతీయ మీడియా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి.. ట్రంప్ టారిఫ్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకునే జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయం వెలువడిరదనే ఊహాగానాలను కొట్టిపారేశారు. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ మినహాయింపు మొదలుకొని జీఎస్టీ శ్లాబుల తగ్గింపు వరకు గడిచిన 18 నెలలుగా చర్చలో ఉన్నాయి. గతేడాది కేంద్ర బడ్జెట్‌కు ముందు నుంచే ఈ సంస్కరణల రూపకల్పన జరుగుతోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సామాన్యులకు ఉపశమనం అందించాలని నాకు గుర్తు చేస్తూనే ఉన్నారని వివరించారు. అమెరికా ఎగుమతి అయ్యే 48 బిలియన్ డాలర్ల నష్టాన్ని భర్తీ చేసేందుకే జీఎస్టీ పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఆ రెండిరటికి సంబంధం లేదు. సంస్కరణల ప్రతిపాదనల సిద్ధం చేసేందుకు సమయం పట్టింది. ఈ ఏడాది మే నెలలోనే ప్రధాని ఈ విషయంపై సంప్రదించానని చెప్పారు. సంస్కరణల గురించి అంతర్గతంగా చర్చించి, ఆపై జీఎస్టీ కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లామని స్పష్టం చేశారు.





# మొహమ్మద్ ప్రవక్త సమసమాజ నిర్మాత

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;**

స్త్రీలకు గౌరవం , బానిసలకు విముక్తి , అన్యాయం పై తిరుగుబాటు , అణగారిన వారికి ఆధారం , మానవ హక్కులు మరియు సమానత్వంపు విప్లవం ఇదే అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ ( స అ సం ) బోధనల. అని జమాఅతే ఇస్లామి హింద్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీమతి ఇష్రత్ భాను నొక్కి వాక్కానించారు. ఈరోజు జమాఅతే ఇస్లామి హింద్ , కొత్తగూడెం మహిళా విభాగం ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్ లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొని ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1500 సంవత్సరాల పూర్వం అజ్ఞానానికి, అసమానతకు, స్త్రీలపై దౌర్జన్యాలకు ఆలవాలమైన సౌదీ అరేబియా ఎడారి ప్రాంతం లో ప్రభవించిన ముహమ్మద్ ప్రవక్త బోధనలు విప్లవాత్మకమైన బోధనలు సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక రంగాలలో మార్పుతో సౌదీ అరేబియాతో పాటు ఎడారి దేశాలలో గొప్ప మార్పు సాధించయి వారు తెలిపారు . ముహమ్మద్ ప్రవక్త బోధనలు కేవలం ముస్లింలకే కాక సర్వమానవాళి అనుసరణీయం అని వారు పేర్కొన్నారు . ఈ బహిరంగ సభకు అధ్యక్షత వహించిన జమాఅతే ఇస్లామి హింద్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి షెహనాజ్ జహంగీర్ మాట్లాడుతూ ముహమ్మద్ ప్రవక్త గారి బోధనలు ప్రస్తుతం సమాజం లో అవసరం అని , పేద వారి పై ధనవంతులకు , స్త్రీ పై పురుషునికి , బలహీనులపై బలవంతులకు ఆధిపత్యం లేదని ప్రవక్త మహనీయులు బోధించారని షెహనాజ్ అన్నారు. ప్రతీకారం కాకుండా క్షమ , దయ , కారుణ్యం తో సమాజ శ్రేయస్సు కోసమే కృషి చేయాలని తెలిపిన ముహమ్మద్ ప్రవక్త బోధనలు ఎల్లకాలం సజీవం అని ఆమె అన్నారు . అన్యాయం అసమానత , హింస , జాతి, వర్ణ , మత, లింగ వివక్షతలకు అంతం చేసిన వారి బోధనలు సజీవం అని సఫూర సుమయ్య జమాఅతే ఇస్లామీ హింద్, కొత్తగూడెం జిల్లా రెండవ అధ్యక్షురాలు అన్నారు . ఈ బహిరంగసభలో ఇంకా జిల్లాలోని మండల అధ్యక్షురాళ్లు జరీన్ ఎజాజ్, ముంతాజ్ , పర్వీన్ , ఫహిమీదా, జరీనా రుబీనా , సభ, ఆయేషా మరియు జరీనా మసూద్, మునీలా రాజ్ , రాజమణి , శుభశ్రీ తదితరులు హాజరయ్యారు. దాదాపు వేయి మందికి పైగా మహిళలు పాల్గొన్నారు.



# చర్లపల్లిలో రూ.80 లక్షల సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**చర్లపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌లోని చిన్న చర్లపల్లి, పెద్ద చర్లపల్లి, లక్ష్మినగర్ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యాలను మెరుగు పరచేందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.చిన్న చర్లపల్లి గవర్నమెంట్ స్కూల్ సమీపంలో విద్యార్థుల రాకపోకలకు సౌకర్యం కల్పించడం, పెద్ద చర్లపల్లి, లక్ష్మినగర్ ప్రాంతాలకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టబడింది. వర్షాకాలంలో నీరు నిల్వ సమస్యలు, రవాణా ఇబ్బందులను తగ్గించడం కోసం ఈ రోడ్డు పనులు అత్యంత అవసరమని స్థానికులు పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు.భవిష్యత్తులో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రాంతానికి అవసరమైన మౌలిక వసతులను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



# జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట నరేంద్ర మోదీ చిత్రానికి పాలాభిషేకం

**చర్లపల్లి, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జీఎస్టీని సరళతరం చేయడం ద్వారా పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ సామాన్యుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోంది. జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల గృహ వినియోగ వస్తువులు, దినసరి అవసరాల సరుకుల ధరలు తగ్గనున్నాయి. దీని ప్రభావం ప్రతి కుటుంబంపై ఉంటుంది. ముఖ్యంగా పండుగల సమయంలో ఇది నిజమైన ఉపశమనంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. అలాగే, "కాంగ్రెస్ పాలన సమయంలో పెరిగిన ధరలు, అధిక పన్నుల భారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మోదీ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు గొప్ప వరంగా మారుతున్నాయి. ఇది కేవలం ఆర్థికంగా ఉపశమనం కలిగించే నిర్ణయం మాత్రమే కాదు, పేదల అభ్యున్నతిని ముందుంచే ప్రభుత్వ నిబద్ధతకు సంకేతం" అని అన్నారు.ప్రజల స్పందన:స్థానికులు కూడా ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. "గృహ ఖర్చులు తగ్గుతాయి, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల పై ఒత్తిడి తగ్గుతుంది" అని ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళ పేర్కొంది. మరొక రైతు "వివిధ ఉపాధి రంగాల్లో ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గడం వల్ల రైతులకు కూడా లాభం కలుగుతుంది" అని అభిప్రాయపడ్డారు.పండుగల సందర్భంగా ఊరట: బతుకమ్మ, దసరా వంటి పండుగల సమయంలో ఎక్కువగా వినియోగించే వస్తువులపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేద కుటుంబాలకు ప్రత్యేకంగా ఊరటను కలిగిస్తుందని నాయకులు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల పండుగ వేళలో కూడా కుటుంబాలు ఖర్చులను సమర్థవంతంగా నిర్వహించగలవని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్ గౌడ్, వెంకుల్, హరి నాయక్, లక్ష్మి నారాయణ, గణేష్ గౌడ్, రమేష్ చౌదరి, సంపంత్, నాగమణి, శ్రీకాంత్, దయ నందు, బ్రాహ్మాచారి, వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొని కార్యక్రమానికి శోభ చేకూర్చారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం, సామాన్యుల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకురానుందని నాయకులు పేర్కొన్నారు. ఇదే దిశగా భవిష్యత్‌లో కూడా పేదల అభ్యున్నతిని ప్రాధాన్యంగా చూసే చర్యలను ప్రభుత్వం చేపడుతుందని హామీ ఇచ్చారు.

# వారంలో మూడు రోజులు ఆఫీసుకు రావాల్సిందే..




వర్క్ ఫ్రమ్ హోమ్‌కు స్వస్తి పలుకుతూ ఐటీ కంపెనీలు ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించే పనిలో పడ్డాయి. తాజాగా అందులో టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా చేరింది. ఉద్యోగులు వచ్చే ఏడాది నుంచి వారంలో కనీసం మూడు రోజులైనా ఆఫీసుకి రావాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు బ్లాగ్‌లో ఓ పోస్టు పెట్టింది. ఈ విధానాన్ని మూడు దశల్లో అమలుచేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మాన్ బ్లాగ్‌లో పేర్కొన్నారు. తొలుత వాషింగ్టన్, రెడ్‌మండ్ కంపెనీ ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులతో దీన్ని మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో ఇదే విధానం అమలవుతుందని వెల్లడిరచారు. కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి 50 మైళ్ల దూరంలో నివసించే ఉద్యోగులకు 2026 ఫిబ్రవరి చివరి నుంచి ఈ విధానం అమలుకానున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అమెరికాలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చే విషయానికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. మహమ్మారి సమయంలో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ కల్చర్ నుంచి దాదాపు అన్ని కంపెనీలు బయటకు వస్తున్నాయి. తమ ఉద్యోగుల్ని తిరిగి ఆఫీసులకు రప్పించేందుకు ఐటీ సంస్థలు అనేక చర్యలు చేపడుతున్నాయి. హెచ్‌సీఎల్, అమెజాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌వంటి కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీసుకు వచ్చి పనిచేసేలా ప్రోత్సహిస్తున్నాయి.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in